సాగుకు సిద్ధం

- దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు
- ఎల్లారెడ్డిపేట మండలంలో 16 వేల ఎకరాల్లో వరి, 5 వేల ఎకరాల్లో పత్తి
- వేములవాడ 3 వేల ఎకరాలు వేములవాడ రూరల్ మండలంలో 5 వేల ఎకరాల్లో పత్తి
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ఎల్లారెడ్డిపేట/వేములవాడఅర్బన్: వానాకాలం సీజన్‌కు రైతులు పొలాల్లో దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉండగా, అందుకు సరిపడే విత్తనాలు, ఎరువులను వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంచారు. పంటలను విస్తారంగా సాగు చేసి అధిక దిగుబడి సాధించేందుకు అన్నదాతలు మృగశిర కార్తె కీలకంగా భావిస్తారు. ఆ కార్తెలోనే దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుకుంటారు. విత్తనాలు విత్తే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. తొలకరి జల్లులు పడిన వెంటనే విత్తనాలను నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కాగా సుమారు 5 నుంచి 6 సెంటీ మీటర్ల వర్షం కురిసిన తరువాతే విత్తనాలను పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ స్థాయిలో వర్షపాతం నమోదైతే నేల చల్లబడి తడితో ఉండి నాటిన విత్తనాలు మొలకెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందని మోతాదు స్థాయిలో వర్షం పడకుంటే నేల తడి లేక విత్తనాలు మొలకెత్తే అవకాశం తక్కువగా ఉంటుందని సూచిస్తున్నారు.



దుక్కులు సిద్ధం చేస్తున్న రైతు

ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల పరిధిలో ఈ సీజన్‌లో 16 వేల ఎకరాల్లో వరి, 5 వేల ఎకరాల్లో పత్తి వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ దిశగా అధికారులు అందుకు కావాల్సిన 4,200 క్వింటాళ్ల వరి విత్తనాలు, 12 వేల పత్తి ప్యాకెట్లు అవసరం ఉండగా ఇప్పటికే పూర్తిస్థాయిలో వరి విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం విత్తనాలు, ఎరువులను మండలంలోని అల్మాస్‌పూర్, రాచర్ల తిమ్మాపూర్, ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోదాములలో నిల్వ చేశారు. నిల్వ చేసిన ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డుతో వెళ్లిన రైతులు విత్తనాలు, ఎరువులను పొందే అవకాశాన్ని కల్పించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రైవేట్ దుకాణాల్లోనూ..

ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా అందించే విత్తనాలు, ఎరువులకు తోడు ప్రైవేట్ దుకాణాల్లో కూడా ఈ సీజన్‌లో అవసరపడేలా టార్గెట్ల ప్రకారం ప్రైవేట్ డీలర్లు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకున్నారు. అధికారులు దుకాణాల్లో డీలర్లు నిల్వ చేసిన స్టాక్‌ను పరిశీలించి సీజన్‌కు ఏ మోతాదులో ఏమీ అవసరం ఉంటాయో అనే దానిపై డీలర్లకు సూచనలు చేస్తున్నారు. దీనికి తోడు ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. నాసిరకం విత్తనాలు రైతులు అంటగడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా ఈ సీజన్‌లో రైతులకు సరిపడే విధంగా ముందుస్తుగానే ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు.

పాడి దుక్కుల్లోనే..



పత్తి విత్తనాలు వేస్తున్న రైతు కూలీలు

వేములవాడ మండలంలో సుమారుగా 3 వేల ఎకరాలు పత్తి పంట, వేములవాడ రూరల్ మండలంలో సుమారుగా 5 వేల ఎకరాల పత్తి పంటలను వేయనున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ వర్షాలు కురువకపోవడంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు వేసవి దుక్కులు చేసుకున్న రైతులు విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే మండలాల్లో నల్లా రేగడి భూముల్లో పత్తి విత్తనాలు నాటారు. అధికంగా వర్షాలు కురిస్తే ఆ నల్లా రేగడి భూముల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందని రైతులు ముందస్తుగానే పత్తి విత్తనాలు నాటుతున్నట్లు తెలిపారు.

విత్తనాలు అందిస్తున్నారు



ఈ సీజన్‌లో ముందుగానే విత్తనాలను సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్నారు. ఎంత విస్తీర్ణంలో పంటలు వేస్తారనేది ముందుగానే అంచనా వేసుకుని విత్తనాలను సిద్ధం చేశారు. విత్తనాలు నిల్వ చేసుకోని పంటల సాగుపై దృష్టి పెట్టాం.
– మోతే మధుసూదన్‌రెడ్డి, రైతు, నారాయణపూర్

పాడి దుక్కుల్లోనే వేస్తున్నాం



ఏప్రిల్‌లో కురిసిన వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్నాం. ఇప్పుడు మళ్లీ దుక్కులు దున్ని పాడి దుక్కిలోనే విత్తనాలు వేస్తున్నాం. వర్షం కురువడంతోనే విత్తనాలు మొలకెత్తుతాయి. ఎప్పుడూ అలాగే నాటుతున్నాం.
– జంగం గంగరాజు, రైతు, నాంపల్లి

వర్షాలు కురిస్తే విత్తడం కష్టం



వర్షాలు అధికంగా కురుస్తే నల్లరేగడి భూముల్లో బురద అవుతుంది. అప్పుడు విత్తనాలు వేయడం కష్టంగా ఉంటుంది. అందుకు ఇప్పుడే పత్తి విత్తనాలు వేస్తున్నాం. పాడి దుక్కుల్లో కూడా గతంలో విత్తాం.
– గడ్డం కృష్ణ, రైతు, తిప్పాపూర్

వర్షం పడ్డ తర్వాత విత్తాలి



వర్షం సమృద్ధిగా కురిసిన తర్వాతనే విత్తనాలు వేయాలి. వర్షం 6 సెంటీ మీటర్లు పడిన తర్వాతనే విత్తనాలు పెట్టాలి. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటంతో భూమిలో వేడి ఉంది. విత్తనాలు పెట్టిన కూడా మొలక వచ్చే అవకాశాలు తక్కువ.
– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా విజయోత్సవ కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే రమేశ్‌బాబు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 13న స్థానిక మహారాజ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాన్ని ఊరేగిస్తున్న వడ్డెర కులస్తులు

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో దుర్గమాత విగ్రహాన్ని ఊరేగించి వడ్డెర కాలనీలో ఏర్పాటు చేసిన గుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోగుల రమేశ్, వెంకన్న, భాస్కర్, జగన్, లస్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న సంఘం సభ్యులు

రుద్రంగి: గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయి అప్పులు తీర్చే దారి లేక ఆత్మహత్య చేసుకున్న వాసాల నరేశ్ కుటుంబ సభ్యులకు పద్మశాలీ యువజన సంఘం కుల బాంధవులు రూ.67,516 ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. దాతలు ముందుకు వచ్చి నరేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆర్థిక సాయం చేసిన కుల బాంధవులకు నరేశ్ భార్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివభక్త మార్కండేయ సంఘం అధ్యక్షుడు పులి రాజేశ్, కార్యదర్శి ఎలిగేటి ప్రదీప్, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు పిల్లమారపు ప్రవీణ్, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు మంచె రమేశ్, సభ్యులు పులి లక్ష్మీరాజం, కొండ సత్యనారాయణ, బింగి గణేశ్, మంచె రాజేశం, పడాల శంకరయ్య, గణేశ్, భాస్కర్, నారాయణ, కృష్ణహరి, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం



రాణా ఆవరణలో స్వైరవిహారం చేస్తున్న పందులు



హైస్కూల్ ఆవరణలో మురుగు నీటి గుంత



మహాలక్ష్మి కాలనీలో అస్తవ్యస్తమైన డ్రెయినేజీ

రుద్రంగి: మండల కేంద్రంలోని కాలనీల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరి కొన్ని ప్రాంతాల్లో మురుగు నిలిచిపోయి దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పందులు సైర్య విహారం చేస్తున్నాయి. డ్రెయినేజీల్లో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు భగీరథ పైపుల్లో చేరి నీరు కలుషితమవుతోంది. ఈగలు, దోమలతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. పాలకవర్గం స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిత్రకథ



తవ్వేసి.. వదిలేశారు

కోనరావుపేట: మండలం సుద్దాల-కనగర్తి గ్రామాల మధ్య తారు రోడ్డుపై అడ్డంగా తవ్వేస్తున్నారు. పంట చేలకు నీటి కోసం పైప్‌లైన్ల ఏర్పాటుకు రోడ్డును తవ్వుతున్న వ్యక్తులు అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుద్దాల-కనగర్తి గ్రామాల మధ్య ఇలా పది చోట్ల అడ్డంగా తవ్వి వదిలేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డును తవ్వి పనులు చేసుకున్న తర్వాత సిమెంట్‌తో వాటిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుల వెల్లువ

- వందల సంఖ్యలో దరఖాస్తుదారులు



బారులు తీరిన దరఖాస్తుదారులు

ముస్తాబాద్: వెనుకబడిన తరగతుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే రుణాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వెలువెత్తుతున్నాయి. ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం, మీ సేవా కేంద్రాల వద్ద వందల సంఖ్యలో దరఖాస్తుదారులు పడిగాపులు పడుతున్నారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఎండలు మండుతున్న లెక్కచేయకుండా యువతీ, యువకులు భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చారు. మొదట మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు తీసుకుని, అక్కడి నుంచి అధికారుల సంతకాలు కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తున్నారు. అక్కడ ధ్రువీకరణ అనంతరం తిరిగి అవే దరఖాస్తు ఫారాలను మీసేవ కేంద్రాల్లో ఇస్తున్నారు. దీంతో కార్యాలయాలకు ఇతర పనులపై వచ్చేవారు కనీసం లోపలికి కూడా వెళ్లలేని పరిస్థితి కనిపించింది.

ఎండిపోయిన మొక్కలు



మార్కెట్ యార్డులో ఎండిపోయిన మొక్కలు

వేములవాడరూరల్: పచ్చదనం, పరిశుభ్రంపై ప్రభుత్వం పదే పదే చెబుతున్నప్పటికీ పచ్చని హరితహారం మొక్కలపై కొంతమంది అధికారులకు పట్టింపులేదు. మొక్కలపై పెంచుతున్న శ్రద్ధ వాటిని నాటడంపై చూపడం లేదు. దీంతో ఏపుగా పెంచిన హరితహారం మొక్కలను మార్కెట్ కమిటీ యార్డులో నిర్లక్ష్యంగా వదిలివేశారు. ఇవి వేసవికాలం కావడంతో పూర్తిగా ఎండి పనికి రాకుండా పోయాయి. ఎండిపోయిన మొక్కలకు బాధ్యులెవరో.? మరి అధికారులే గుర్తించాలి..

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న గోసిపల్లి ప్రతాప్

సిరిసిల్లటౌన్: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని బీజేపీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి గోసిపల్లి ప్రతాప్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పూర్వ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి చేరవేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు లగిశెట్టి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గర్రిపెల్లి ప్రభాకర్, ఆడేపు రవిందర్, జిల్లా ప్రధాన క్యాదర్శి రేగుల మల్లికార్జున్, రెడ్డబోయిన గోపి, నాయకులు శఖులం రాజు, గూడూరి భాస్కర్, కమలాకర్‌రావు, బర్కం వెంకటలక్ష్మి, మల్లారెడ్డి, నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడిట్ పూర్తి చేయని సీసీలకు మెమోలు

ముస్తాబాద్: ముస్తాబాద్ ఐకేపీలో ఆడిటింగ్ పూర్తి చేయని సీసీలకు మెమోలు జారీ చేసినట్లు ఏపీఎం జయసుధ సోమవారం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మండల సమాఖ్య, గ్రామ సంఘాల ఆడిట్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయనందున మెమోలు ఇవ్వడం జరిగిందన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించిన వారికి మెమోలను డీఆర్‌డీవో ఆదేశాల మేరకు మెమోలు వచ్చాయన్నారు. సమయపాలన పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఏపీఎం అన్నారు.

పుస్తె మెట్టెల వితరణ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన అనాథ యువతి శనిగరపు మానిక వివాహానికి సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సోమవారం పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల సందీప్,బాబు, సల్మాన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



సింధు (ఫైల్)

బోయినపల్లి: కాలిన గాయాలతో రెండు నెలలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయినపల్లి మండలం దేశాయిపల్లి లో నివాసముంటున్న సింధు(22)అనే వివాహిత యువతి సోమవారం తుది శ్వాస విడిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మండలం సంకెపెల్లి గ్రామానికి చెందిన సింధుతో, కొదురుపాకకు చెందిన శ్రీనివాస్‌కు సుమారు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లుగా వీరు దేశాయిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కాగా రెండు నెలల క్రితం నిప్పంటుకున్న సింధును కాలిన గాయాలతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, మృత్యువుతో పోరాడుతూ సింధు మంగళవారం మృతి చెందింది. కాగా ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మామిడి మహేందర్ తెలిపారు.

తన భూమి ఇప్పించాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగుడు బోయిని నర్సయ్య

రుద్రంగి: తనకు జీవనాధారమైన వ్యవసాయ భూమి కబ్జాకు గురైందని, రెండేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని, కబ్జాకు గురైన భూమిని ఇప్పించాలని సోమవారం బోయిని నర్సయ్య అనే దివ్యాంగుడు పట్టాదారు పాసుబుక్, దరఖాస్తు ఫారాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సర్వే నెంబర్ 176/119లో గల తన ఎకరం భూమి కబ్జాకు గురైందని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాడు. రుద్రంగి తహసీల్దార్ భాస్కర్ నర్సయ్య వద్దకు వెళ్లి రూల్స్ పరంగా దరఖాస్తు చేసుకోవాలని, ఇలా చేయడం సరైంది కాదని సిబ్బందితో ఫ్లెక్సీని తీసి వేయించారు. అనంతరం వికలాంగుడైన బోయిని నర్సయ్యకు పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

విద్యార్థులకు చేయూతనియ్యడం అభినందనీయం



స్కూల్ బ్యాగ్‌లతో విద్యార్థులు

సిరిసిల్లఅర్బన్: తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులు చేయూత నందించడం అభినందనీయమని డీఈవో రమేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని శివనగర్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్‌తో పాటు ఇతర సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి అభినందనీయమని కొనియడారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని తిప్పాపూర్, అనంతగిరి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీవో చంద్రయ్య సోమవారం పరిశీలించారు. జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. దీంతో పాటు హరిత నర్సరీలను పరిశీలించి మొక్కలకు రోజుకు రెండు సార్లు నీరు పట్టాలని సూచించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోనరావుపేట: దివ్యాంగులకు అందిస్తున్న పింఛన్ రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ వెంకట్రావుపేటలో సీఎం చిత్రపటానికి దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ పల్లె మంజుల, వీడీసీ చైర్మన్ మంతెన మల్లేశం, వికలాంగుల సంఘం అధ్యక్షుడు పల్లం లింగయ్య పాల్గొన్నారు.

సమాచారం

ఐటీఐ మొదటి విడత అడ్మిషన్ గడువు పొడిగింపు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు గడువు తేదీ పొడిగించినట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 19 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ వెహికిల్, వెల్డర్, మెకానిక్ డీజిల్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నేడు జిల్లాలో..

కేడీసీసీ బ్యాంక్ భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

బోయినపల్లి: మండల కేంద్రంలో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ నూతన భవనాన్ని మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభిస్తారని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ముగ్గుల పోటీలు

గంభీరావుపేట/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గంభీరావుపేట కేజీ టు పీజీ ప్రాంగణం, తంగళ్లపల్లి మార్కండేయ ఆలయం, ఎల్లారెడ్డిపేట సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సైలు మహేశ్, పి.లక్ష్మారెడ్డి, ప్రేమ్‌దీప్ తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొని, ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందుకోవాలన్నారు.

నియామకం

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మధు



నియమాక పత్రం తీసుకుంటున్న మధు

చందుర్తి: మండల బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మోత్కుపల్లి మధును నియమించినట్లు జిల్లా బీసీ సంక్షేమ సంఘం బత్తుల మహేందర్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ నియమానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట, వంతడుపుల గ్రామాలకు చెందిన దుర్మట్ల నర్సయ్య రూ.18 వేలు, రహీంఖాన్‌పేటకు చెందిన ఏనుగుల సుధాకర్ రూ.30 వేలు, దూస భారతవ్వ రూ.18 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకట్‌రెడ్డి, పర్శరాం పాల్గొన్నారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 36వ వార్డులో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. వార్డుకి చెందిన ఆదిరెడ్డికి రూ. 37,500, చొక్కి తిరుపతికి రూ.14 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కౌన్సిలర్ కల్లూరి రాజు అందజేశారు. కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్, కొక్కుల నర్సయ్య, దేవయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అక్కపల్లిలో..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లిలో లబ్ధిదారులకు సర్పంచ్ ముక్క మధుకర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోగూరి ప్రదీప్‌రెడ్డి, నాయకులు కొప్పుల రవీందర్‌రెడ్డి, బోనాల శ్రీధర్, జనార్దన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నర్సయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.